ప్రజాశక్తి
గురువారం 29 డిసెంబర్ 2022



పోలీసుస్టేషన్‌లో డిఐజి తనిఖీలు


ప్రజాశక్తి-విజయనగరం


ఎస్‌పి,డిఎస్‌పిలతో మాట్లాడుతున్న డిఐజి

వార్షిక తనిఖీల్లో భాగంగా విశాఖపట్నం రేంజ్ డిఐజి ఎస్.హరికృష్ణ బుధవారం 1వ పట్టణ పోలీసుస్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులు, స్టేషను ప్రాంగణం, లాకప్, సిడి ఫైల్స్ పరిశీలించారు. పెండింగులో ఉన్న కేసుల్లో దర్యాప్తు వేగవంతం చేయాలని, సకాలం లో కోర్టుల్లో అభియోగ పత్రాలను దాఖలు చేయాలని అధికారులను ఆదేశించారు. సైబరు నేరాలు, మహిళల భద్రత, లోన్ యాప్ మోసాలు పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. డిఐజి వెంట ఎస్‌పి ఎం.దీపిక, ఇన్‌ఛార్జి డిఎస్‌పి ఆర్.శ్రీనివాసరావు, సిఐ బి.వెంకటరావు ఉన్నారు.

పింఛను మొత్తం పెంచుతామని ప్రకటించిన కొద్ది రోజుల్లోనే నిబంధనల పేరిట పింఛనుదారులకు ప్రభుత్వం నోటీసులు జారీచేస్తోంది. ఆదాయపన్ను పరిధిలోకి వస్తున్నారని, వెయ్యి చదరపు అడుగుల ఇల్లు ఉందని, 300యూనిట్లకన్నా మించి విద్యుత్ వినియోగిస్తున్నారని, మూడెకరాలకు మించి భూమి ఉందని, కుటుంబంలో ఒకరు లేదా అంతకంటే ఎక్కువ మంది ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నారని ఆయా నోటీసుల్లో స్పష్టం చేసింది. అంతే కాదు సుమా...! తాత్కాలికంగా పింఛన్లను నిలిపివేస్తున్నట్టు స్పష్టం చేసింది. దీంతో, పింఛనుదారుల్లో ఆందోళన మొదలైంది. జనవరి నుంచి పింఛను పెరుగుతుందని ఆశపడితే, పింఛను తొలగింపు కోసం నోటీసులు ఇస్తున్నారని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సచివాలయంలో వినతి అందించేందుకు వచ్చిన దనాన జానకమ్మ



వెయ్యి చదరపు అడుగుల ఇల్లు ఉంటే

పింఛను ఫట్

- ఆదాయ పన్ను కట్టినా, మూడెకరాల పొలం ఉన్నా గండమే
- 300 యూనిట్ల విద్యుత్తు ఉపయోగించినా అంతే సంగతులు
- పింఛనుదారులకు ప్రభుత్వం నోటీసులు
- అవ్వాతాత, విభిన్న ప్రతిభావంతులు, దీర్ఘకాలిక రోగుల గుండెల్లో గుబులు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 15 కేటగిరిల్లో 2,75,756 మందికి ప్రస్తుతం పింఛన్లు అందుతున్నాయి. వీటిలో అత్యధికంగా 1,51,773 మంది వృద్ధులకు, 58,144మంది వితంతువులకు, 35,408 విభిన్న ప్రతిభావంతులకు పింఛన్లకు అందుతున్నాయి. అభయస్తం పథకం కింద మరో 10,149మందికి అందుతున్నాయి. వీరితోపాటు కిడ్నీ, గుండె, తలసేమియా, కాన్సర్ వంటి దీర్ఘకాలిక రోగులు, చేనేత, గీత కార్మికులు, ఒంటరి మహిళలు, హిజ్రా, మత్సకారులు, కళాకారులకు కూడా పింఛను పథకం అమలవుతోంది. వీరిలో వృద్ధులు, వితంతువులు, చేనేత కార్మికులకు, కల్లుగీత కార్మికులు, మత్స్యకారులు, ఒంటిరి మహిళలు చర్మకారులకు రూ.2,500 చొప్పున అందుతున్నాయి. దీర్ఘకాలిక రోగులకు రూ.3వేల నుంచి రూ.10వేల వరకు అందుతున్నాయి. వీరందరికీ కలిపి మొత్తం నెలకు రూ.69.38కోట్ల మేర విడుదలవుతోంది. జనవరి నుంచి రూ.250 చొప్పున పింఛను పెంచి రూ.2750 అందిస్తామని ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన విషయం విధితమే. దీంతో, పెరగనున్న పింఛనుతో ఎంతోకొంత ఆర్థిక ఇబ్బంది తీరుతుందని పింఛను దారులు ఆశించారు. కానీ, పెంపు అమలులోకి రాకముందే నోటీసులు ఇచ్చి, తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్టు ప్రకటించడంతో వేలాదిమంది ఆందోళన చెందుతున్నారు. నిబంధనలు కొత్తకాకపోయినప్పటికీ పింఛను పెంచుతున్న సమయంలో ప్రక్షాలన పేరుతో నిలిపివేత నోటీసులు జారీచేయడంతో ప్రభుత్వం భారాన్ని తగ్గించుకోవడానికి చూస్తుందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. 2.31సెంట్లకు (వెయ్యి చదరపు అడుగులు) మించిన స్థలంలో ఇల్లు ఉంటే పేదరికంలో లేనట్టేనా? అని జనం ప్రశ్నిస్తున్నారు.

పై నిబంధనలను కారణాలుగా పేర్కొంటూ పార్వతీపురం మన్యం జిల్లాలో 2,500 మంది పింఛనుదారులకు సచివాలయాల ద్వారా నోటీసులు అందజేశారు. పార్వతీపురం పట్టణంలోనే 400 మందికి నోటీసులు జారీచేసినట్టు సమాచారం. విజయనగరం కార్పొరేషన్ పరిధిలో 1542 మందికి నోటీసులిచ్చారు. నోటీసులు ఇచ్చినంత మాత్రాన పింఛన్లు నిలిపివేసినట్టుగా కాదని అధికారులు చెబుతున్నారు. విజయనగరం జిల్లా వ్యాప్తంగా సుమారు మూడు వేల మందికి నోటీసులు ఇచ్చినట్టు అధికారుల అంచనా. నోటీసులన్నీ సచివాలయాల స్థాయి నుంచే వెళ్లడం వల్ల ఈనెలాఖరు నాటికి స్పష్టంగా ఎంతమందికి నోటీసులు ఇచ్చామనే విషయం తెలుస్తుందని డిఆర్‌డిఎ పీడీ కల్యాణ్ చక్రవర్తి ప్రజాశక్తికి తెలిపారు. వేపాడ మండలంలో 72 మందికి నోటీసులిచ్చినట్టు ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్ స్పష్టం చేశారు. ఇందులో ఆతవలో 7, బల్లంకిలో 6, బానాదిలో 4, బొద్దాంలో 9, డిఆర్‌పేటలో 3, జాకేరులో 2, కెజిపూడిలో 4, కొంపల్లిలో 4, ఎన్‌కెఆర్‌పురంలో 6, నల్లబెల్లిలో 1, పాటూరులో 2, ఆర్‌ఎస్‌పేటలో ఒకటి, సింగరాయిలో 6, సోంపురంలో 3, వల్లంపూడిలో 3, వేపాడలో 6, వావిలపాడులో 3, వీలుపర్తిలో 2 మంది చొప్పున ఉన్నారు. 15రోజుల్లో అర్హతకు సంబంధించిన ఆధారాలను ధ్రువీకరణ పత్రాలతో చూపించాలని నోటీసుల్లో పేర్కొన్నారు. నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలో 400మందికి, రేగిడి మండలంలో 170 మందికి పింఛన్లు నిలిపివేస్తూ నోటీసులు ఇచ్చినట్టు సమాచారం.

తప్పుడు సమాచారంతో పింఛను తొలగింపు!

పాచిపెంట : పాచిపెంట మండల కేంద్రంలోని పోతులవీధికి చెందిన దనాన జానకమ్మ అనే వృద్ధురాలికి ఆరేళ్లకు పైగా పింఛను అందుతోంది. కానీ ఆమె 300 యూనిట్ల విద్యుత్తు వినియోగించడంతో పింఛను తొలగిస్తున్నట్లు వాలంటీర్ ద్వారా నోటీసు అందింది. ఆమె మనుమడు వసంతరావుతో కలిసి సచివాలయానికి వెళ్లగా, జానకమ్మ ఆధార్ నంబరుతో 10 వరకు సర్వీస్ నంబర్లు ఉన్నట్లు తేలింది. తప్పుడు సమాచారంతో తన పింఛను ఎలా తొలగిస్తారని బాధితురాలు జానకమ్మ వాపోయారు. బుధవారం సిపిఎం నాయకులు కోరాడ ఈశ్వరరావు ఆధ్వర్యాన జానకమ్మ సచివాలయ సిబ్బందికి వినతి అందించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు ఈశ్వరరావు మాట్లాడుతూ నిర్దిష్ట సమాచారం లేకుండా ఏదో వంకతో పింఛన్లు ఆపేస్తామని నోటీసులివ్వడం దారుణమన్నారు. సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యం వల్ల బాధితులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ఏమైనా చిన్న చిన్న తప్పిదాలుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించాలి తప్ప ప్రజలను ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. వెంటనే అర్హులందరికీ పింఛన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కొడుకుల ఇంటిని నాకు ముడిపెట్టారు



నాకు నలుగురు కుమారులు. వారికి నేనంటూ పెద్దగా ఆస్తిపాస్తులు ఇవ్వలేక పోయినా, వారి కాయా కష్టంతో వారంతా ఇళ్లు కట్టుకున్నారు. ఆ ఇళ్లన్నీ తనవిగా పేర్కొంటూ నోటీసులు ఇవ్వడం ఎంత వరకు సమంజసం. సొంత ఇల్లు ఉంటే పింఛను కట్ చేయడం ఏమాత్రం సరికాదు. అందులోనూ ఇంటి విస్తీర్ణంతో ముడిపెట్టడం మరింత మోసం.

-నిడదవ శివుడు, గొల్లపల్లి, బొబ్బిలి మున్సిపాలిటీ

సచివాలయాల్లో ప్రిన్సిపల్ సెక్రటరీ తనిఖీ

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని పెద్ద తాడివాడ సచివాలయాన్ని రాష్ట్ర పంచాయతీ రాజ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ గోపాలకృష్ణ ద్వివేది బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన సచివాలయానికి సంబంధించిన రికార్డులన్నింటినీ పరిశీలించారు. కార్యదర్శి, సచివాలయ సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. వారి హాజరు రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాలన్నారు. కార్యక్రమంలో జెసి మయూర అశోక్, జెడ్‌పి సిఇఒ, ఇతర జిల్లా అధికారులు, ఎంపిడిఒ డి.స్వరూపారాణి, తదితరులు పాల్గొన్నారు.


నందిగామలో ఎస్‌డబ్ల్యుపిసిని పరిశీలిస్తున్న గోపాలకృష్ణ ద్వివేది

ద్వివేదిని కలిసిన కార్యదర్శులు

మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం తరపున గోపాలకృష్ణ ద్వివేదిని సత్కరించారు. పంచాయతీ కార్యదర్శుల పదోన్నతుల విషయమై ఆయన వద్ద ప్రస్తావించగా త్వరలోనే ఉద్యోగోన్నతులు ఇస్తామని తెలిపారు. గ్రేడ్ 5 పంచాయతీ కార్యదర్శులకు డ్రాయింగ్ పవర్స్ కూడా ఇస్తున్నామని చెప్పారు.

చెత్త నుండి సంపద తయారీ కేంద్రం పరిశీలన

భోగాపురం: మండలంలోని నందిగామ పంచాయతీలో చెత్త నుండి సంపద తయారు చేయు కేంద్రాన్ని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాబివృద్ధి ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సక్రమంగా నిర్వహణ చేస్తున్నారన్నారు. అద్భుతంగా నిర్వహిస్తున్న సర్పంచ్ గరే మురళీమోహన్ రావును అభినందించారు. పంచాయతీ కార్యాలయ నిర్వహణ, గ్రామంలో పరిశుభ్రత అద్భుతంగా ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ కళ్యాణ్ చక్రవర్తి, డ్వామా పీడీ ఉమా పరమేశ్వరి, డిపిఒ నిర్మలాదేవి, ఎంపిడిఒ డి. బంగారయ్య, ఇఒపిఆర్‌డి సురేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిర్ణీత వ్యవధిలోగా రీసర్వే

రోజుకు 200 ఎకరాలు సర్వే జరగాలి : కలెక్టర్ సూర్యకుమారి

ప్రజాశక్తి-విజయనగరం

ప్రతీ గ్రామానికి నిర్ణీత కాలవ్యవధిని నిర్ణయించుకొని, రీసర్వే ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆదేశించారు. సర్వే ప్రక్రియ అత్యంత పకడ్బందీగా, పారదర్శకంగా, ఖచ్చితమైన లెక్కలతో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. రీ సర్వే ప్రక్రియకు సంబంధించి ఆర్‌డిఒలు, వివిధ మండలాల తహశీల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్లు, సర్వేయర్లతో బుధవారం సాయంత్రం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మండలాల వారీగా సర్వే ప్రక్రియను సమీక్షించారు. గ్రౌండ్ ట్రూతింగ్, రికార్డు వర్కు, మిస్సింగ్ డేటా, రోవర్ పనులపై ఆరా తీశారు. ప్రతీ మండలంలో ఒక్కో బృందం రోజుకు ఎన్ని ఎకరాలను సర్వే చేస్తుందో తెలుసుకున్నారు. పని నెమ్మదిగా జరుగుతున్న మండలాల అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వే ప్రక్రియలో ఏమైనా సమస్యలు ఎదురైతే వెంటనే తమకు తెలియజేయాలని సూచించారు. ప్రతీఒక్కరి రోజువారీ ప్రగతి అంతా ఆన్‌లైన్లో కనిపిస్తుందని చెప్పారు. తహశీల్దార్లు ప్రత్యేక శ్రద్ధ వహించి సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ కోరారు. జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ మాట్లాడుతూ, సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. ఒక్కో మండలంలో రోజుకు కనీసం 200 ఎకరాలు పూర్తి అయ్యేవిధంగా ప్రణాళికతో ముందుకు వెళ్లాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కెఆర్‌ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ, సర్వేశాఖ ఎడి త్రివిక్రమరావు పాల్గొన్నారు


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సూర్యకుమారి

ఘనంగా ఎస్ఎఫ్ఐ 40 వసంతాల వేడుకలు

- పలుచోట్ల ఆటల పోటీలు..జెండా ఆవిష్కరణలు
- మెగా రక్తదాన శిబిరం జయప్రదం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విద్యార్థి ఉద్యమ రథసారధి, ఉద్యమాల వేగుచుక్క భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా 40 వసంతోత్సవాల సందర్భంగా బుధవారం మెసానిక్ టెంపుల్‌లో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరం విజయవంతమైంది. తొలుత ఆ సంఘం కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరణ చేశారు. ఎస్ఎఫ్ఐ లోగోను ఆవిష్కరించారు. అనంతరం మెసానిక్ టెంపుల్ లో స్వాతంత్ర్య సమరయోధులు భగత్ సింగ్, రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలేసి నివాళులు అర్పించి, మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎస్ఎఫ్ఐ పూర్వ నాయకుల కన్వీనర్ శివానంద్‌కుమార్ మాట్లాడుతూ 1983లో జిల్లాలోని బొబ్బిలి రాజా కాలేజీలో విద్యార్థి సమస్యలపై ఏర్పడిన ఎస్ఎఫ్ఐ నేటికి నలభై వసంతాలు పూర్తి చేసుకుని నిరంతరం విద్యారంగంలో వస్తున్న సమస్యలపై పోరాడుతూనే ఉందని అన్నారు. పేదల అభ్యున్నతికి కృషి చేస్తూ సేవారంగంలో కూడా మునుముందుకు వెళ్తూ తోడ్పడుతుందని అన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి.రామ్మోహన్ మాట్లాడుతూ విద్యార్థి ఉద్యమాల్లో ఎందరో అమరులను కోల్పోయినా, నేడు విద్యారంగంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొస్తున్న మార్పులపై విద్యార్థులను ఐక్యం చేస్తూ అమరుల స్ఫూర్తితో పోరాటం చేస్తుందని అన్నారు. మరో పక్క కష్టకాలంలో ప్రజలను ఆదుకొనేందుకు రక్తదానం, అనాథులకు ఆహారం పంపిణీ, బట్టలు సేకరించి పేదవాళ్లకు ఇవ్వడం వంటి సేవా కార్యక్రమాలు చేస్తుందని అన్నారు. అందులో భాగంగా జిల్లా కేంద్రంలో 100 మందితో నిర్వహించిన రక్తదాన శిబిరానికి మంచి స్పందన వచ్చిందని, జిల్లాలో అన్ని చోట్ల జెండా ఆవిష్కరణలు, ఆటల పోటీలు నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో రోటరీ బ్లడ్ బ్యాంకు ప్రతినిధులు రవి, శ్రీకాంత్, వైష్ణవి , ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వెంకటేష్, జిల్లా కార్యవర్గసభ్యులు రామకృష్ణ, హర్ష, సౌమ్య, రవి, నగర అధ్యక్ష కార్యదర్శులు రాజు,రమేష్, నాయకులు కిరణ్,బాలాజీ,ఎర్రమ్మ తదితరులు పాల్గొన్నారు.


రక్తదాతలను అభినందిస్తున్న ఎస్ఎఫ్ఐ పూర్వ నాయకులు శివానంద్‌కుమార్

గునుపూరుపేటలో జెండా ఆవిష్కరణ

డెంకాడ : నూతన విద్యా విధానం రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.హర్ష డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ 53వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా గునుపూరుపేట హైస్కూల్లో ఎస్ఎఫ్ఐ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సోమేశ్ తదితరులు పాల్గొన్నారు.

టిడిపి అబద్ధపు ప్రచారాన్ని తిప్పికొట్టాలి

ప్రజాశక్తి-డెంకాడ

ప్రజలకు మరింత చేరువై వారి మద్దతుతో 2024 ఎన్నికల్లో వైసిపి జెండాను మరో మారు రెపరెపలాడించేలా సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, పార్టీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. రానున్న ఏడాదిన్నర కాలంలో ప్రభుత్వంతో సమానంగా పార్టీ పరంగా ప్రజలకు సేవలు అందించాలని స్పష్టం చేశారు. టిడిపి అబద్ధపు ప్రచారాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

వైసిపి నెల్లిమర్ల నియోజవర్గ విస్తృత స్థాయి సమావేశం మోపాడ సమీపంలోని భూమాత లేఔట్ లో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ 2024 ఎన్నికలే లక్ష్యంగా ప్రభుత్వంతో పాటు సమాంతరంగా పార్టీ పరంగా ప్రజలకు సేవలు అందించడంలో భాగంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి శ్రీకారం చుట్టిన సచివాలయ కన్వీనర్ల సేవలు వచ్చే జనవరి 1 నుంచి ప్రారంభం కానున్నాయని తెలిపారు. పెరిగిన పింఛన్ తో పాటు సిఎం లేఖలను వాలంటీర్లతో పాటు కన్వీనర్లు లబ్ధిదారుల వద్దకు వెళ్లి అందించాలన్నారు. త్వరలోనే 50ఇళ్లకు ఇద్దరు చొప్పున నియమించే గృహ సారథులు జనవరి 29న ప్రభుత్వం మంజూ చేసే మూడో విడత వైయస్సార్ ఆసరా కార్యక్రమాన్ని వివరించాలన్నారు. టిడిపి అధికారంలో ఉండగా జిల్లాకు ఏం చేశారో చెప్పాలని ఆయన కోరారు. ఎటువంటి అనుమతులూ లేకుండా ఎన్నికల ముందు భోగాపురం ఎయిర్‌పోర్టుకు శంకుస్థాపన చేయడమేనా టిడిపి చేసిన అభివృద్ధి అని ఎద్దేవా చేశారు .ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు నాయుడు బీసీ నినాదం చేస్తున్నాడని, 2014- 2019 మధ్య విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో బిసిలకు మంత్రి పదవులు ఎందుకు ఇవ్వలేకపోయాడని అన్నారు. చంద్రబాబు నాయుడుకు బుర్ర చెడిపోయిందని ఏవేవో మాట్లాడుతున్నాడని హేళన చేశారు.

ఒకటి నుంచి సచివాలయ కన్వీనర్ల సేవలు ప్రారంభం : మంత్రి బొత్స



సభలో మాట్లాడుతున్న విద్యాశాఖా మంత్రి బొత్ససత్యనారాయణ

వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జిశ్రీనివాసరావు మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి సేవలను లబ్ధిదారుల ముంగిటకే తీసుకొచ్చారన్నారు. ఎంపి బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ 2014 ఎన్నికల ముందు ఇచ్చిన 600 హామీల్లో ఎన్ని అమలు చేశారో టిడిపి నేతలు చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎమ్మెల్సీ డాక్టర్ సురేష్ బాబు, నియోజకవర్గ పరిశీలకులు అంధవరపు సూరిబాబు, ఎమ్మెల్సీ అభ్యర్థి సుధాకర్, ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, సర్పంచులు, ఎంపిటిసిలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పల్సర్ బైక్ అంటే యువతలో క్రేజ్ : డిఎస్‌పి

ప్రజాశక్తి- విజయనగరం కోట

పల్సర్ బైక్ అంటేనే యువతకు ఒక క్రేజ్, ఫ్యాషన్ అని డిఎస్‌పి ఆర్.శ్రీనివాసరావు అన్నారు. బుధవారం స్థానిక బజాజ్ షోరూంలో పల్సర్ పి 150 న్యూ ఫ్యూచర్స్ బైకును లాంచ్ చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన డిఎస్‌పి మాట్లాడుతూ పల్సర్ అంటే యూత్‌కు ఫ్యాషన్ అని, అయితే ఎంత ఫ్యాషన్ అయినప్పటికీ జాగ్రత్తలు పాటించవలసిన అవసరం ఉందని అన్నారు. పల్సర్ బైక్‌లే దొంగతనాలకు ఎక్కువగా ఆస్కారం ఉందని అన్నారు. షోరూం మేనేజింగ్ డైరెక్టర్ ఎం.సుధాకర్ మాట్లాడుతూ బజాజ్ అంటే పల్సర్, పల్సరే బజాజ్ షోరూంగా నేడు తయారయిందన్నారు. నేటి యువతకు కావలసిన అన్ని ఫ్యూచర్స్ ఈ బైక్ లో ఉన్నాయని, రానున్న రోజుల్లో మరిన్ని బైక్‌లు అందుబాటులోకి వస్తున్నాయని తెలిపారు. మేనేజర్ జగదీష్ మాట్లాడుతూ పల్సర్ పి 150 ఫీచర్స్ బి.ఫంక్షన్ ప్రొజెక్టర్, ఎల్ఇడి హెడ్ ల్యాంపు ఉన్నారు. అనంతరం బైక్ మొదటి కొనుగోలుదారులైన వెంకటేష్, గణేష్‌లకు డిఎస్‌పి, ఎమ్‌డి చేతుల మీదుగా తాళాలు అందజేశారు. ఔట్ డోర్ సేల్స్ మేనేజర్ మౌళి , షోరూం సిబ్బంది పాల్గొన్నారు.


పల్సర్ న్యూమోడల్‌బైక్‌ను విడుదల చేస్తున్న డిఎస్‌పి

రాష్ట్రస్థాయి పోటీలకు బాల్ బ్యాడ్మింటన్ జట్లు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొనేందుకు అండర్-14 బాయ్స్ అండ్ గర్ల్స్ టీమ్‌లు కడప జిల్లా ప్రొద్దుటూరుకు బుధవారం బయలుదేరి వెళ్లాయి. ఇందులో బాలుర విభాగంలో 10 మంది, బాలికల విభాగంలో 10మంది టీముతో పాటు ఇద్దరు కోచ్ మేనేజర్లుగా వెళ్తున్నారు. రాష్ట్ర పోటీల్లో రాణించి విజేతగా తిరిగి రావాలని స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎల్‌వి రమణ ఆకాంక్షించారు.

ఈనెల 30న నెట్ బాల్ జిల్లా జట్లు ఎంపిక పెదమజ్జిపాలెం జెడ్‌పి ఉన్నత పాఠశాల ఆవరణలో జరగనుందని స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎల్ వి రమణ ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు ఉదయం 9 గంటలకు హాజరు కావాలని తెలిపారు.


రాష్ట్రస్థాయి పోటీలకు బయలుదేరిన క్రీడాకారులు

క్రీడలకు ప్రోత్సాహం కరువు

క్రీడాకారుల పట్ల శాపంగా మారిన పే అండ్ ప్లే విధానం - కోచ్‌లు లేకుండానే క్రీడలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

క్రీడలకు ప్రసిద్ధిగాంచిన జిల్లాలో ఈ ఏడాది క్రీడాకారులకు ప్రోత్సాహం కరువైంది. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం క్రీడలకు శాపంగా మారడమే కాకుండా, క్రీడాకారులకు భారంగా మారింది. క్రీడలకు ప్రోత్సాహం కరువు అవ్వడంతో రాష్ట్ర స్థాయి సిఎం కప్ టోర్నమెంట్‌లు నిర్వహించలేని దుస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం, శాప్ లు ఉన్నాయి. క్రీడా సంఘాలకు, చివరకు స్కూల్ గేమ్స్ కు కూడా పైసా ఇవ్వన్నీ దుస్థితి నెలకొంది. ఫలితంగా అసోసియేషన్ లు, క్రీడాకారులు డబ్బులు పెట్టి క్రీడలు ఆడాల్సిన పరిస్థితి నెలకొంది.

ఈ ఏడాది ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని అందరూ భావించారు. అందుకు విరుద్ధంగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు క్రీడాకారులకు శాపంగా మారాయి. కనీసం ఉద్యోగాలకు ఉపయోగపడే జాతీయ సర్టిఫికెట్లు కూడా సాధించలేని దుస్థితిలో చాలా క్రీడలు ఉన్నాయంటే ప్రభుత్వానికి క్రీడలు పట్ల ఉన్న చిత్త శుద్ధి అర్థమవుతోంది. ఇటీవల కాలంలో వెయిట్ లిఫ్టింగ్ లో గురునాయుడు, పవర్ లిఫ్టింగ్‌లో అప్పలనాయుడు పతకాలు సాధించారు. వారు అసోసియేషన్లు, స్పాన్సర్లు సహకారం తప్ప జిల్లా యంత్రాంగం నుంచి ఎటువంటి సహకారం అందలేదు. క్రీడాకారులు స్పాన్సర్లు మీద ఆధార పడి తప్ప ప్రభుత్వ ప్రోత్సాహంతో రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది.



భర్తీ కానీ కోచ్ పోస్టులు

క్రీడల అభివృద్ధికి పాలకులు నిధులు విడుదల చేయకపోగా, కనీసం క్రీడలను నేర్పించే పోస్టులు కూడా భర్తీ చేయలేదు. పే అండ్ ప్లే ఒక ఇబ్బంది అయితే కనీసం దాని ద్వారా క్రీడలు నేర్పించే కోచ్‌లు లేరు. జిల్లాలో కేవలం ఒకే ఒక్క కోచ్‌తో నడిపిస్తున్నారు. ఆయన కూడా చీఫ్‌కోచ్‌గా బాధ్యతలు నిర్వహించడంతో క్రీడలు ఆడించలేని స్థితిలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఉంది.

తరలి పోయిన క్రీడా పాఠశాల.. తెరుచుకోని స్విమ్మింగ్ పూల్

క్రీడలను ప్రోత్సహించేందుకు జిల్లాలో నెలకొల్పిన క్రీడా పాఠశాల మూతపడింది. 70మందికి విద్యార్థులతో ఎంతో ప్రతిష్టాత్మకంగా నడుస్తున్న పాఠశాలను నిధులు లేవనే సాకుతో శాప్ క్రీడా పాఠశాలను ఎత్తేసింది. దీంతో అందులో చేరిన వారి భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. ఇంకోవైపు క్రీడా పాఠశాల ఉందనే నెపంతో సుమారుగా వందల కోట్లతో విజ్జీ మైదానంలో అనేక కోర్టులు, ఇండోర్ స్టేడియం, స్కేటింగ్ కోర్టు, క్రీడా పాఠశాల భవనాల నిర్మాణం జరిగాయి. నిధుల లేమితో భవనాలు నిర్మాణం మధ్యలో ఆగిపోయాయి. మరో వైపు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న స్విమ్మింగ్ పూల్ నిరాదరణకు గురైంది. ప్రైవేటు వ్యక్తులకు లీజుకు ఇచ్చేయాలని టెండర్లకు పిలిచారు. ఎవరూ ముందుకు రాకపోవడంతో స్విమ్మింగ్‌పూల్ వృథాగా మారింది.

క్రీడాకారుల భవితవ్యం అగమ్య గోచరం

క్రీడా సంఘాలలో అత్యధికంగా ఉన్న సంఘాలు గుర్తింపు లేకుండా క్రీడలు ఆడిస్తూ క్రీడాకారులు భవిష్యత్ తో ఆడుకుంటున్నారు. జిల్లాలో కబ్బడ్డి మూడు సంఘాలు,తైక్వాండో మూడు సంఘాలు,చేస్ రెండు సంఘాలు ఇలా ఎవరికి నచ్చినట్లు వారు సంఘాలు పెట్టి క్రీడలు అడిస్తున్నా సంఘాలు క్రీడాకారులకు భవిష్యత్ ఇచే సర్టిఫికెట్లు ఇప్పించలేని దుస్తితి.దీంతో జిల్లాలో గత రెండు ఏళ్లుగా సర్టిఫికెట్లు లేఖ ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ సమస్య ఉండటంతో ప్రభుత్వం కూడా అసోసియేషన్ లు సమస్యలు పరిష్కారం చేయక పోవడంతో క్రీడాకారులకు శాపంగా మారాయి.



సిఎం కప్ బ్యాడ్మింటన్ పోటీల్లో రెండోస్థానంలో నిలిచిన నెలిమర్ల జట్టుకు చెక్కును అందిస్తున్న మంత్రి రోజా (ఫైల్)

అమలుకు నోచుకోని క్రీడా క్లబ్ లు

మరోవైపు గ్రామ స్థాయిలో క్రీడలను ప్రోత్సహించేందుకు క్రీడా క్లబ్ లకు రాష్ట్ర ప్రభుత్వం స్వీకారం చుట్టింది. జిల్లాలో సగం మండలాల్లో క్రీడా క్లబ్ లు ఏర్పాటు చెయ్యలేదు. ఏర్పాటైన చోట నిర్వహణ లేదు.

అరకొరగా క్రీడా పోటీలు

ఈ ఏడాది వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్, క్రికెట్, అథ్లెటిక్స్, హ్యాండ్ బాల్, బాక్సింగ్ చదరంగం, తైక్వాండో వంటి పోటీలు క్రీడా సంఘాల ద్వారా జరిగాయి. జిల్లాలో రాష్ట్ర స్థాయి సీనియర్ బాక్సింగ్ పోటీలు విజయనగరంలోను, జూనియర్స్ వాలీబాల్ రాష్ట్ర పోటీలు బొబ్బిలి లోను, చదరంగం జాతీయ పోటీలు విజయనగరంలోను జరిగాయి. వీటితో పాటు జిల్లాలో రంజీ ట్రోఫీ క్రికెట్ పోటీలకు చింతవలసలోని పిజిజి రాజు క్రీడా మైదానం వేదికంగా నిలిచింది. గోవా, ఆంధ్ర, ముంబాయి ఆంధ్ర, మహారాష్ట్ర ఆంధ్ర జట్లు రంజీ మ్యాచ్‌లు జరిగాయి. అంతర్జాతీయ క్రీడాకారులు అజింక్యా రహానే, కెఎస్ భరత్, రుతూరాజ్ గైక్వాడ్ వంటి ఇండియా జట్టు క్రీడాకారులు రావడంతో క్రికెట్ అభిమానుల్లో కొంత ఉత్సాహం కనిపించింది. స్కూల్ గేమ్స్ పోటీల్లో రాణించిన 50 మంది క్రీడాకారులు జాతీయస్థాయి పోటీలకు వెళ్లారు. ఈ ఏడాది ముఖ్యమంత్రి జన్మదినం సందర్భంగా నిర్వహించిన కబడ్డీ రాష్ట్రస్థాయి పోటీల్లో నెల్లిమర్ల నియోజకవర్గం జట్టు లక్ష రూపాయల ప్రైజ్ మనీ గెలుచుకుంది.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్‌ఎంపిలు

ఆర్‌ఎంపిల ఆత్మీయ కలయిక

విజయనగరం : నగరంలోని శిల్పారామంలో బుధవారం ఆర్‌ఎంపిల ఆత్మీయ కలయిక ఘనంగా జరిగింది. జిల్లా వ్యాప్తంగా సుమారు 400 మందికి పైగా ఆర్‌ఎంపిలు హాజరై ఆటపాటలతో అలరించారు. ముఖ్య అతిథులుగా లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షులు భీశెట్టి బాబ్జీ, విశాఖపట్నం బ్రిందా హాస్పిటల్ సర్జికల్ ఆంకాలజీ డాక్టర్ వంశీధర్ పుట్రేవు హాజరై 2023 క్యాలెండర్ ఆవిష్కరించారు. గ్రామాలలో ఎక్కువగా నమ్మేది గ్రామీణ వైద్యులనేనని, ప్రజలలో క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కలిగించాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫెడరేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగం జోషి, జిల్లా అధ్యక్షులు గెద్ద చిరంజీవి, కార్యదర్శి కోట్ల పైడిరాజు, ఉపాధ్యక్షులు ముత్యాలరావు, రామ్మూర్తి రాజు, సహాయ కార్యదర్శి రమణ నాయుడు, నాయకులు ఉమా శంకర్, దివాకర్, అంజన్ రాయ్, గుప్తా తదితరులు పాల్గొన్నారు.

సమ్మేటివ్ పరీక్షల ప్రశ్నపత్రాలు విడుదల

తెర్లాం : జనవరి నెల నుండి జరగనున్న మొదటి సమ్మేటివ్ పరీక్షల మాదిరి ప్రశ్నపత్రాలను బుధవారం ఉదయం నందబలగ జిల్లా పరిషత్తు పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఐ. సీతారాం, ఉపాధ్యాయులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంగ్ల భాష ఉపాధ్యాయుడు యం. విజయ మోహన్ రావు ఆధ్వర్యంలో తయారు చేసిన ఆరు నుంచి 10వ తరగతి ఆంగ్ల భాషా ప్రశ్నా పత్రాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగమన్నారు. డెల్టా అధ్యక్షుడు విజయ మోహన్‌రావు మాట్లాడుతూ ఏటా అన్ని ఫార్మేటివ్, సమ్మే టివ్, పబ్లిక్ మాదిరి ప్రశ్న పత్రాలను డెల్టా ఆధ్వర్యంలో ఆంగ్లభాష ఉపాధ్యాయులు రూపొందిస్తున్నారని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని యాజమాన్యాల పాఠశాలల ఉపాధ్యాయులు ఈ మాదిరి ప్రశ్న పత్రాలను డెల్టా వాట్సప్ గ్రూపుల ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు. ఎనిమిదవ తరగతి ప్రశ్నపత్రాలను ప్రత్యేకంగా సీబీఎస్‌ఈ బ్లూ ప్రింట్ ప్రకారం తయారు చేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు జి. సత్యనారాయణ, తిరుపతిరావు, విద్యార్థులు పాల్గొన్నారు

ప్రోటోకాల్ ఉల్లంఘనపై ఎంపిటిసి ఆవేదన

మెంటాడ : మండలంలో పెదమేడపల్లి మోడల్ స్కూల్‌లో బుధవారం జరిగిన విద్యార్థులకు ఉచిత ట్యాబ్‌లు పంపిణీ కార్యక్రమంలో ప్రొటోకాల్ ఉల్లంఘన చేయడంతో స్థానిక ఎంపిటిసి రెడ్డి ఎర్రి నాయుడు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రభుత్వ కార్యక్రమానికి తనను ఆహ్వానించక పోవడం అవమానంగా భావిస్తున్నానని ఆయన అన్నారు. ప్రతిపక్ష నేతలను కూడా ఎంతో ఆప్యాయంగా అభిమానించే వ్యక్తి ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర అని, ఆయన కార్యక్రమంలో వుంటుండగా ప్రోటోకాల్ ఉల్లంఘన జరగడం దారుణమన్నారు. స్థానిక నేతలకు ఇచ్చే గౌరవం ఇదేనా అని పాఠశాల యాజమాన్యం, అధికారులపై క్రమశిక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళతానని చెప్పాడు. స్థానిక నేతలను కలుపుకొని ముందుకు సాగడం మంచిదని స్కూల్ కమిటీ చైర్మన్ జి. వెంకటరాజు అన్నారు. భవిష్యత్తులో ఇటువంటి సమస్యలు పునరావృతం కాకుండా చూడాలని వారు డిమాండ్ చేశారు.

అధ్యాపకులకు శిక్షణ

నెల్లిమర్ల : స్థానిక అంబేద్కర్ గురుకుల పాఠశాలలో బుధవారం సబ్జెక్ట్ ఎన్రిచ్‌మెంట్ ప్రోగ్రామ్‌ను నిర్వహించారు. విజయనగరం, మన్యం జిల్లాల్లో ఇంటర్మీడియేట్ బోధిస్తున్న అధ్యాపకులకు తెలుగు, ఇంగ్లీష్, ఎకనామిక్స్, కామర్స్, సివిక్స్, హిస్టరీ సబ్జెక్ట్స్ మీద ఎన్రిచ్‌మెంట్ కార్యక్రమాన్ని రెండు జిల్లాల సమన్వయకర్త బలగ చంద్రావతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ ప్రోగ్రామ్‌కు 38 హాజరు కావాల్సి ఉండగా 34 మంది హాజరయ్యారు. విద్యార్థులు పబ్లిక్ పరీక్షలలో శతశాతం ఉత్తీర్ణత సాధించే విధంగా స్టడీ మెటీరియల్సును తయారు చేశారు. సాంఘీక సంక్షేమ గురుకుల కళాశాలలో విద్యార్థులందరికీ స్టడీ మెటీరియల్ ఇచ్చి అత్యధిక మార్కులు వచ్చేటట్టుగా అధ్యాపకులందరికి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కళాశాల ప్రిన్సిపల్ ఉషారాణి, రెండు జిల్లాల అధ్యాపకులు పాల్గొన్నారు.

బొబ్బిలిలో చిరుజల్లులు

బొబ్బిలి : బొబ్బిలిలో బుధవారం సాయంత్రం చిరుజల్లులతో వర్షం కురిసింది. వర్షానికి ధాన్యం రైతులు ఇబ్బందులు పడగా కూరగాయలు, మొక్కజొన్న, చెరకు పంటలకు వర్షం బాగా అనుకూలిస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సంక్షేమం పేరుతో దోచుకుంటున్న ప్రభుత్వం

శృంగవరపుకోట : సంక్షేమ పేరు చెప్పి ప్రభుత్వం ప్రజలను దోచుకుంటుందని మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. బుధవారం మండలంలోని భవానీ నగర్, అంబుదాసు పాలెం గ్రామాలలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షులు జి.ఎస్.నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పెరిగిన నిత్యవసర వస్తువులు ధరలు, విద్యుత్ చార్జీలు, ఆర్టీసీ మోతలతో సామాన్య పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన ప్రజలకు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని ఆవేదనను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి రెడ్డి వెంకన్న, క్లస్టర్ కోఆర్డినేటర్ ఇందుకూరు శ్రీనివాసరావు, బీసెట్టి అరుణ, టిడిపి సీనియర్ నాయకులు ఆడారి సూరిఅప్పారావు, తూర్పాటి ఆదిబాబు, అల్లూరి సత్తిబాబు రాజు, ఐటిడిపి రాష్ట్ర సెక్రెటరీ కిరణ్, ఐటిడిపి నియోజకవర్గ ఇంఛార్జీ అనకాపల్లి చెల్లయ్య, వసంత సత్యారావు తదితరులు పాల్గొన్నారు.


కనీస వేతనాలు అమలు చేయాలి

విజయనగరం కోట : ఆర్‌టిసి కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని ఆ యూనియన్ నాయకులు ఎ.జగన్మోహన్ డిమాండ్ చేశారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో కాంట్రాక్ట్ కార్మికుల సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆర్టీసీ సంస్థ ద్వారానే జీతాలు చెల్లించాలని, లేదా ఆప్కాస్ లో చేర్చాలని కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జనవరి 2 3 4 తేదీల్లో భీమవరంలో సిఐటియు రాష్ట్ర మహాసభలు జరుగుతున్నాయని, అందులో చర్చించి భవిష్యత్ పోరాటాలు నిర్ణయిస్తామని తెలిపారు. ఈనెల 29 ఉదయం 10 గంటలకు కార్మిక చైతన్య బస్సు యాత్ర విజయనగరం చేరుకుంటుందని కాంట్రాక్ట్ కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తిరుపతిరావు, జగదీష్, అశోక్, శ్రీను, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఒకేషనల్ కళాశాలలో తనిఖీ

బొబ్బిలి : బొబ్బిలి పట్టణంలో ఉన్న ఇంటర్మీడియట్ ఒకేషనల్ కళాశాలలను జిల్లా త్రీ మెన్ కమిటీ సభ్యులు ఎం.కృష్ణ, ప్రసాద్, ప్రకాష్ బుధవారం తనిఖీ చేశారు. మహాత్మా గాంధీ, సాయిరాం, లక్ష్మమ్మ, న్యూటన్ ఒకేషనల్ కళాశాలను తనిఖీ చేసి విద్యార్థుల యొక్క ఆన్ ది జాబ్ ట్రైనింగ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు సాంకేతిక నైపుణ్యంతో విద్యను అందించాలని కళాశాల యాజమాన్యాలను కమిటీ సభ్యులు కోరారు.

సాంకేతిక లోపంతో ఆగిపోయిన రైలు



మధ్యలో నిలిచిపోయిన రైలు

బొబ్బిలి : నిజాముద్దీన్ నుంచి విశాఖ వెళ్తున్న సమత ఎక్స్‌ప్రెస్ రైలు ఇంజన్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో దిబ్బగుడివలస కాపలా గేటు వద్ద నిలిచిపోయింది. బుధవారం రాత్రి సుమారు 20 నిమిషాలు గేటు వద్ద రైలు నిలిచిపోవడంతో వాహనాలు, ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. గేటుకు ఇరువైపులా వాహనాలు స్తంభించాయి. సాంకేతిక సిబ్బంది ఇంజిన్‌ను బాగు చేయడంతో ప్రయాణికులు, వాహనదారులు, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

అంగన్వాడీ కేంద్రాల్లో తనిఖీలు

వంగర : మండలంలోని సంగాం, కె. కొత్తవలస గ్రామాలలో గల అంగన్వాడి కేంద్రాలను వీరఘట్టం ఐసిడిఎస్ పిఒ పూర్ణిమ బుధవారం తనిఖీ చేశారు. ఆయా కేంద్రాలలో ఉన్న గర్భిణీలు బాలింతలతో మాట్లాడి పౌష్టికాహారం సక్రమంగా అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. రికార్డులు సక్రమంగా నిర్వహించాలని అంగన్వాడి వర్కర్లకు ఆదేశించారు

విద్యార్థుల భవిష్యత్తే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి- మెంటాడ

ప్రపంచ స్థాయిలో ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు పోటీపడాలని, విద్యార్థులు భవిష్యత్తు, ఉన్నత శిఖరాలను అధిరోహించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని, విద్యార్థులు భవిష్యత్తే ప్రభుత్వ లక్ష్యం అని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. బుధవారం పెదమేడపల్లి మోడల్ స్కూల్ ఆవరణలో ఉచిత ట్యాబ్‌లు పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేలపై రాసిన దశ, పుస్తకాలపై పెన్సిల్, పెన్నులతో రాసిన రోజులు పోయి, డిజిటల్ విద్య, కంప్యూటర్ విద్య ప్రస్తుతం నడుస్తుందని అన్నారు. ప్రపంచ స్థాయిలో ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు పోటీపడాలన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా విద్యకోసం ఇన్ని పథకాలను ప్రవేశపెట్టిన ప్రభుత్వాలు, ముఖ్యమంత్రులు లేరన్నారు. మండలంలో 16 పాఠశాలలకు గాను 467మంది విద్యార్థులు, 67మంది ఉపాధ్యాయులకు ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్నామన్నారు. అనంతరం మెంటాడలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించి ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రెడ్డి సన్యాసినాయుడు, వైసిపి నాయకులు లెంక రత్నాకర్ నాయుడు, మండలవ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ లచ్చిరెడ్డి అప్పలనాయుడు, వైస్ ఎంపిపిలు సారిక ఈశ్వరరావు, పొట్టంగి దుర్గ, సాలూరు నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు సిరిపురం నాగమణి, స్కూల్ కమిటీ చైర్మన్ జి వెంకటరాజు, సర్పంచ్ ప్రకాశమ్మ, పార్టీ నేతలు పొడిపిరెడ్డి అప్పలనాయుడు, డి దేవుడు, వడ్డి జనార్ధన్ రావు, ఎంపిడిఒ పి త్రివిక్రమ్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సుమంత్, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేపాడ : మండలంలోని కొండగంగుబూడి, సోంపురం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు బుధవారం ట్యాబ్‌లను పంపిణీ చేశారు. సోంపురం సర్పంచ్ ఎం. గంగరాజు, కేజీపూడి గ్రామ సర్పంచ్ జి. బంగారయ్యలు మాట్లాడుతూ ప్రభుత్వం అందించిన ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్‌లు ఎం. పరదేశి నాయుడు, ఎస్ గంగులు, డి నరసింహమూర్తి, సోంపురం గ్రామ పంచాయతీ వైస్ సర్పంచ్ సత్యారావు, పిసి చైర్మన్ ఎల్.నూకరత్నం, పాఠశాల



మెంటాడ: విద్యార్థినికి ట్యాబ్‌ను అందిస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రధానోపాధ్యాయులు పి. బాల భాస్కరరావు, గ్రామ పెద్దలు మడ్డేశ్వరరావు, ఎల్. దేముడు, ఉగ్గిన శీను, వెల్ఫేర్ అసిస్టెంట్ కె. నారాయణరావు విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలలకు సంబంధించిన ఉపాధ్యాయులు, సిఆర్‌పిలు కాటపల్లి రాంప్రసాద్, కోటేశ్వరరావు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రేగిడి: మండలంలోని లక్ష్మీపురం, మజ్జి రాముడుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు వైసిపి నాయకులు, సర్పంచ్ కెంబూరు తేజ వెంకటేశ్వరరావు, ముంజేటి కిషోర్ కుమార్, హెచ్‌ఎం కృష్ణారావు బుధవారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులకు ఆధునిక విద్యనందించేందుకు ప్రభుత్వం దృష్టి సారిస్తుందన్నారు. ఈ ట్యాబులు వినియోగించుకోవాలని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బొబ్బిలిరూరల్: ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ విప్లవానికి శ్రీకారం చుట్టిన ఘనత వైసిపి ప్రభుత్వానికే దక్కుతుందని ఎంపిపి శంబంగి లక్ష్మి అన్నారు. మండలంలోని కోమటిపల్లి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉచిత ట్యాబులు పంపిణీ కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. ట్యాబ్‌లను వినియోగించుకుని విద్యార్థులు ఉన్నత చదువులు చదవాలన్నారు.

నారణప్ప వలసలో : నారాయణప్ప వలస ప్రాథమికోన్నత పాఠశాలలో ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జె.సి.రాజు, సర్పంచ్ వడ్డి లచ్చమ్మ, ఎంపిటిసి గొట్టాపు తవిటమ్మ, డిసియంయస్ డైరెక్టర్ గొట్టాపు సూర్యనారాయణ, వైసిపి నాయకులు అప్పారావు, వంగపండు శ్రీరాములు నాయుడు, సింహాచలం, గంగు నాయుడు, సత్యనారాయణ, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

భోగాపురం: మండలంలోని కవులువాడ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందజేసిన ట్యాబ్ లను సర్పంచ్ కొండకు ఎల్లియమ్మ బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కెకె. రెడ్డి, అప్పన్న, విజిలెన్స లావణ్య, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బాడంగి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంఇఒ కృష్ణమూర్తి అధ్యక్షతన విద్యార్థులకు ఉచిత ట్యాబ్ పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన్నప్పలనాయుడు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ విప్లవానికి అంకురం చుట్టిన ఏకైక ప్రభుత్వం తమదేనన్నారు. చదువులో సమానత్వం ఉండాలనే ఉద్దేశంతో, పిల్లల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి పెద్దింటి రామారావు, ఎంపిపి బొ గౌరీ, సర్పంచ్ కండి రమేష్, తహశీల్దార్ ఇఒపిఆర్‌డి, నాయకులు తెంటు మధు, మరిపి శంకర్‌రావు, ఉపాధ్యాయులు, గ్రామ సర్పంచులు, గ్రామ పెద్దలు వైసిపి నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

గుర్ల: గుజ్జంగివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు ట్యాబులను జెడ్‌పిటిసి శీర అప్పలనాయుడు, వైసిపి నాయకులు పొట్నూరు సన్యాసినాయుడు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని విద్యార్థులను డిజిటల్ దిశగా నడిపించడంతోపాటు కరోనా వంటి విపత్కర పరిస్థితులు తలెత్తినప్పుడు అభ్యసనాన్ని కొనసాగించేందుకు వీలుగా ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతోన్న విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌డిఎ చైర్మన్ బెల్లాన బంగారు నాయుడు, స్థానిక నాయకులు అధికారులు పాల్గొన్నారు.

దుక్కి దున్నకుండా మొక్కజొన్న సాగు

ప్రజాశక్తి - గుర్ల

వరి కోతల అనంతరం వరి మాగాణిల్లో దుక్కి దున్నకుండా మొక్కజొన్న సాగు చేయటం వల్ల సుమారు 3 తడుల నీరు ఆదా అవడంతో పాటు, పెట్టుబడి ఖర్చు ఆదాచేయవచ్చు అని జిల్లా వ్యవసాయ అధికారి పి.త్రినాధ్ స్వామి అన్నారు. మండలంలోని వల్లాపురం గ్రామంలో బుధవారం జీరో టిల్లేజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పంట కోసిన అనంతరం ఉన్న తేమలో (నల్ల పదును) మార్కర్ యంత్రాలతో వరుసలలో రంధ్రాలు చేసి మొక్కజొన్న విత్తనాలను నేరుగా నాటడం వల్ల అప్పటికే నేలలో ఉన్న కొన్ని పోషకాలు అంది పంట ఏపుగా పెరుగుతుందన్నారు. సాధారణ పద్ధతిలో రైతులు సుమారు 3 సార్లు దుక్కి చేసి, ఆఖరి దుక్కు ఎడ్ల నాగలితో చేస్తూ మహిళా కూలీలతో విత్తనాలు నాటడం జరుగుతుందన్నారు. రైతుల వద్ద కాడి ఎడ్లు లేని ప్రస్తుత పరిస్థితిలో మొక్క జొన్న నాట్లు వేయడం కొంచెం సమస్యాత్మకంగా మారిందని ఎడిఎ ఎస్. కోటేశ్వరరావు అన్నారు. ఇటీవల కాలం వరకు కర్రతో చేసిన పెగ్ మార్ పరికరాన్ని వాడేవారని, ప్రస్తుతం రెడ్డీస్ ల్యాబ్ వారు అందించిన డబల్ మార్క్ పరికరాన్ని అందుబాటులకి తెచ్చామని చెప్పారు. కేవలం ఒక వ్యక్తి తక్కువ శ్రమతో లాగ గలిగే ఈ పరికరం ఉపయోగించడం వల్ల మొక్కజొన్నలో



జీరో టిల్లేజ్‌ను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

వరుసల మధ్య 50 సెంటీ మీటర్ల, మొక్కల మధ్య 15 సెంటీ మీటర్ల దూరంతో రంధ్రాలు పడతాయన్నారు. ఆ యంత్రం వెనుక ఆ రంధ్రాల్లో కేవలం ఇద్దరు మహిళా కూలీలు విత్తనాలు వేయగలుగుతారని చెప్పారు. ఒక రోజులో కేవలం ఐదుగురు కూలీలతో ఒక ఎకరంలో మొక్కజొన్న విత్తనాలు వేయవచ్చున్నారు. రైతులకు ప్రతి గ్రామంలో అందుబాటు ఉంచుతామని రెడ్డీస్ ఫౌండేషన్ సమన్వయకర్త చనమల్లు రవి అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు పి.అప్పలసూరి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి- బొబ్బిలి

ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం విఫలమవుతోందని రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.గోపాలం, బి.రాంబాబు అన్నారు. మండలంలోని పారాది, ఎస్.సీతా రాంపురం, రొంపల్లి గ్రామాల్లో జరుగుతున్న ధాన్యం కొనుగోలు తీరును బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కౌలు రైతులకు ఈ-క్రాప్ చేయకపోవడంతో ప్రైవేట్ మిల్లర్లకు ధాన్యాన్ని అమ్ముకుంటున్నామని చెప్పారు. గోనె సంచులు, రవాణా భారం రైతులపై వేయడంతో రైతు భరోసా కేంద్రాలకు ధాన్యం ఇస్తే అదనపు భారం పడుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తరలిస్తే గోనె సంచులు, రవాణా ఛార్జీల భారం భరిస్తే క్వింటాలు ధాన్యానికి రూ.1800 వరకు మాత్రమే మిగులుతుందని, అదే ప్రైవేట్ మిల్లర్లకు ధాన్యం



రైతులతో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

అమ్మితే రూ.1900 వస్తుందని రైతులు చెప్పారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వల్ల రైతులకు నష్టమే తప్ప లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ రైతుల నుంచి ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. గోనె సంచులు ప్రభుత్వం సరఫరా చేసి రవాణా చార్జీలు ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోలు చేయకపోతే పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

పింఛనర్లకు నోటీసులివ్వడం దుర్మార్గం

ప్రజాశక్తి- నెల్లిమర్ల

పింఛనర్లకు ప్రభుత్వం నోటీసులివ్వడం దుర్మార్గమని టిడిపి నాయకులు అన్నారు. టిడిపి నగర నాయకులు బయిరెడ్డి లీలావతి ఆధ్వర్యంలో టిడిపి నాయకులు బుధవారం నగర పంచాయతి కమిషనర్‌ను కలిసి పింఛనర్లకు ఇచ్చిన నోటీసులపై ఆరా తీశారు. నగరపంచాయతి పరిధిలో సుమారు 400 మందికి పింఛన్లు నిలుపుదలకు నోటీస్‌లు ఇవ్వడం చాలా విచారకరమన్నారు. నవరత్నాలు ఇస్తామని చెప్పి పింఛన్లు నిలుపుదల చేయడం ఎంతవరకూ సమంజసమన్నారు. నోటీసులు ఇచ్చిన వారందరి సమస్యలు సత్వరం పరిష్కరించి వారి పింఛన్లను పునరుద్ధరణ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కాళ్ల సత్యవతి, కలిశెట్టి కన్నంనాయుడు, కాళ్ళ రాజశేఖర్, పొడుగు కృష్ణవేణి, మీనాక్షి, పోలుబోతు సత్యనారాయణ, మద్దిల శ్రీను, రాజగిరి వాసు, నడిపేన నారాయణరావు, సారిపల్లి అప్పారావు, రెడ్డి వేణు, కె. కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

పింఛనదారులకు నోటీసులివ్వడం దారుణం

వేపాడ : మండలంలో 74 మంది పింఛనదారులకు ప్రభుత్వం నోటీసులు జారీ చేయడం దారుణమని టిడిపి మండల పార్టీ



కమిషనర్‌తో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

అధ్యక్షులు గొంప వెంకటరావు ఒక ప్రకటనలో అన్నారు. జగన్మోహన్‌రెడ్డి తాను అధికారంలోకి వస్తే ప్రస్తుతం పొందుతున్న సామాజిక పింఛన్లను రూ.3వేలకు పెంచి అందిస్తామని నమ్మబలికి వారి ఓట్లు కొల్లగొట్టి అధికారాన్ని పొందిన తరువాత వెరిఫికేషన్ పేరిట నోటీసులు జారీ చేయడం సిగ్గుచేటన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మార్చి కేవలం సామాజిక పింఛనపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వారిని నోటీసుల పేరిట వేధించడం తగదన్నారు. పింఛనర్లకు అన్యాయం చేయకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

టేకు కలప అక్రమ రవాణా

ప్రజాశక్తి- రేగిడి

- టింబర్ డిపోల వద్ద నిల్వ
- అనుమతులు లేకుండా తరలింపు
- పట్టించుకోని అధికారులు

రాజాం-పాలకొండ ప్రధాన రహదారి సంకిలి, ఉంగరాడమెట్ట, బూరాడ మీదుగా రాజాం, విజయనగరం, పొందూరు టింబర్ డిపోలకు టేకు కలప అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. ప్రధాన రహదారిపై అనుమతులు లేకుండా అక్రమ రవాణా జరుగుతున్నా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడం పలు విమర్శలకు తావిస్తోంది. ఈ అక్రమ టేకు కలప రవాణా చిన్న శిర్లాం, తాటిపాడు జంక్షన్, గురువారం, రాజాం, పొందూరు తదితర గ్రామాల టింబర్ డిపోలకు తరలిస్తున్నట్లు పలువురు చెబుతున్నారు. వాస్తవానికి టేకు తరలిస్తే రెవెన్యూ అధికారుల అనుమతులు తప్పనిసరి. వారిచ్చిన అనుమతుల ధ్రువీకరణ పత్రాలతోనే టేకు కలప రవాణా చేయాల్సి ఉంటుంది. కానీ నిబంధనలను తుంగలో తొక్కి దర్జాగా టేకు అక్రమ రవాణా పట్టపగలే చేస్తుండటం ఆశ్చర్యాన్ని కలిగిస్తోందని పలువురు అభిప్రాయ పడుతున్నారు. అక్రమ టేకు రవాణాకు సహకరించడానికి ప్రతి చెక్ పోస్ట్ వద్ద



ట్రాక్టర్‌తో అక్రమంగా తరలిపోతున్న టేకు కలప

ముడుపులు చెల్లిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులు స్పందించి టేకు అక్రమ రవాణాకు అడ్డకట్ట వేసేలా చర్యలు తీసుకోవాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అవినీతి లేని పరిపాలనే లక్ష్యం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అవినీతి, లంచగొండితనం లేని సుపరిపాలన అందించడమే వైసిపి ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. బుధవారం పెద్దపల్లి వీధిలో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. పథకాలు పొందే సమయంలో ఎవరికైనా లంచాలు ఇస్తున్నారా అని ప్రశ్నించారు. తమ ప్రాంతంలో విద్యుత్ స్తంభాలు లేవని దీనివల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు డిప్యూటీ స్పీకర్ దృష్టికి ప్రజలు తీసుకురావడంతో వెంటనే స్పందించిన ఆయన సంబంధిత అధికారులకు విద్యుత్ స్తంభాలు ఏర్పాటుకై చొరవ చూపాలని ఆదేశించారు. కార్యక్రమంలో మేయర్ వి.విజయలక్ష్మి, ఫ్లోర్ లీడర్ ఎస్‌వివి రాజేష్, 15 డివిజన్ కార్పొరేటర్ అల్లు చాణక్య, పైడితలమ్మ దేవస్థానం ట్రస్ట్ బోర్డు మెంబర్ వెత్సా శ్రీనివాసరావు, బొంగ భానుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి : సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా పాలన అందిస్తున్నామని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు



బొబ్బిలి: పథకాలు గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

అన్నారు. బుధవారం 2వ సచివాలయ పరిధిలోని 7వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణారావు, వైస్ చైర్మన్లు గొలగాన రమాదేవి, మండల పార్టీ అధ్యకులు శంబంగి వేణుగోపాలనాయుడు, వార్డు కౌన్సిలర్ దిబ్బ సునీత, మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు, ప్రభుత్వ అధికారులు, వార్డు కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, కో-ఆప్షన్ సభ్యులు, పట్టణ వైసిపి నాయకులు పాల్గొన్నారు.

శ్రేష్ఠ పథకంపై విస్తృత అవగాహన

ప్రజాశక్తి-విజయనగరం

కేంద్ర ప్రభుత్వం పరిధిలో అమలయ్యే శ్రేష్ఠ పథకం గురించి, దానిలో చేరేందుకు నిర్వహించే జాతీయ అర్హత పరీక్ష గురించి విద్యార్థులకు విస్తత అవగాహన కల్పించాలని వివిధ విభాగాల అధికారులను జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆదేశించారు. సిబిఎస్‌సి సిలబస్ బోధించే పాఠశాలలను, జూనియర్ కళాశాలలను ఎంపిక చేయాలని పేర్కొన్నారు. 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యాభ్యాసం చేసేందుకు ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన బాల, బాలికల ప్రయోజనార్థం అమలు చేస్తున్న ఈ పథకం తాలూక ఫలాలు వారికి దక్కేలా అధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. 2022-23 విద్యా సంవత్సరంలో చేరేందుకు వచ్చే ఏప్రిల్ లో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో జాతీయ అర్హత పరీక్ష ఉంటుందని, సంబంధిత పరీక్షకు ఆయా పాఠశాలలు, కళాశాలల నుంచి విద్యార్థులను గుర్తించి తర్ఫీదు ఇవ్వాలని ఆదేశించారు. శ్రేష్ఠ పథకంలో భాగంగా 9వ తరగతి విద్యార్థులకు



కలెక్టర్ సూర్యకుమారి

2500 సీట్లు, ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు 500 సీట్లు కలిపి మొత్తం 3వేల సీట్లు జాతీయ స్థాయిలో అందుబాటులో ఉంటాయని, వాటిలో అత్యధికంగా జిల్లా విద్యార్థులు సాధించే విధంగా పక్కా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులకు రెసిడెన్సియల్ ఎడ్యుకేషన్‌తో పాటు ఇతర ఆర్థిక సహాయం లభిస్తుందని తెలిపారు. సంబంధిత వివరాలతో కూడిన జాబితాలను తదుపరి చర్యల నిమిత్తం సాంఘిక సంక్షేమ శాఖ అధికారులకు అందజేయాలని పేర్కొన్నారు.

ఆహార ఉత్పత్తులపై శిక్షణ

గరివిడి : స్థానిక మండల సమైక్య కార్యాలయంలో మహిళా సంఘాల సభ్యులకు ఆహార ఉత్పత్తులపై బుధవారం ఒక రోజు శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ శిక్షణ కార్యక్రమానికి గరివిడి, గుర్ల, మెరకముడిదాం మండలాల్లో సీడ్ క్యాపిటల్ కింద రుణాలు తీసుకున్న మహిళలు పాల్గొన్నారు. ఎపిడి కే. సావిత్రి మాట్లాడుతూ మహిళా సంఘ సభ్యులు ఆహార ఉత్పత్తులు తయారీ పై దృష్టి సారించి ఆర్థికాభివృద్ధి చెందాలన్నారు. గ్రామాల్లో అందుబాటులో ఉన్న చిరుధాన్యాలతో ఆహార ఉత్పత్తుల తయారు చేసి న్యూట్రిషన్ ఫుడ్‌ను అందించాలన్నారు. ఎపి ఫుడ్ కార్పొరేషన్ ప్రతినిధి ఎన్. జ్యోత్స్న మాట్లాడుతూ ఎన్‌ఆర్‌ఎల్‌ఎం ద్వారా గ్రామీణ ప్రాంతాలలో మహిళలకు ఆహార ఉత్పత్తుల తయారీ నిమిత్తం ఇస్తున్న సీడ్ క్యాపిటల్ రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిపిఎం ఎల్.హెచ్ జయశ్రీ, గరివిడి క్లస్టర్ ఏరియా కో ఆర్డినేటర్ జి. సీతారామ్, ఎస్‌విఇపి ఎపిఎం ఏ పద్మ, ఇపిఒ ఎపిఎం జి. విజయలక్ష్మి, గరివిడి ఎపిఎం ఎల్. పద్మ తదితరులు పాల్గొన్నారు.

మాడిపోతున్న మామిడి పూత

వేపాడ : గత వారం రోజులుగా కురుస్తున్న మంచు వల్ల మామిడి పూత మాడిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో వీలుపర్తి, కొంపల్లి, బల్లంకి, ఎన్‌కెఆర్‌పురం, నల్లబెల్లి, వేపాడ, దబ్బిరాజుపేట, గుడివాడ, పీకేఆర్‌పురం, సీతారాంపురం, కేజీ పూడి గ్రామాలలో మామిడి తోటల్లో ఉన్న పూత పూర్తిగా రంగు మారి నాశనమైపోతుందని రైతులు చెబుతున్నారు. ఈ మంచుకు పెసర పంట పూత కూడా మాడిపోతుందని వాపోతున్నారు.



మాడిపోయిన మామిడి పూత

ట్రాక్టర్ ఫ్యాన్ రెక్క తగిలి వ్యక్తి మృతి

శంగవరపుకోట : వరి చేను నూర్చుతున్న ట్రాక్టర్ ఫ్యాన్ రెక్క తగిలి గేదెల శ్రీకాంత్ (30) అనే వ్యక్తి మృతి చెందాడని ఎస్‌ఐ తారకేశ్వరరావు బుధవారం తెలిపారు. మండలంలోని సొంత గౌరమ్మపేట పంచాయతీ దొగ్గపేట గ్రామానికి చెందిన గేదెల శ్రీకాంత్ మండలంలోని వేసలపూడి కళ్లాల వద్ద మంగళవారం రాత్రి వరి నూర్పులో ధాన్యం గాలి పోస్తుండగా ట్రాక్టర్ ఫ్యాన్ రెక్క విరిగి శ్రీకాంత్ తలకు బలంగా తగిలింది. దీంతో శ్రీకాంత్ అక్కడక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఒక కుమారుడు ఉన్నారని మృతిని తల్లి త్రివేణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

'పప్పుల చీటింగ్' పై కేసు నమోదు

గుర్ల : పప్పుల చీటీ భాదితులు ఫిర్యాదు మేరకు గుర్ల ఎస్ఐ జి. శిరీష నిర్వాహకురాలు పతివాడ శ్రీలేఖపై కేసు నమోదు చేశారు. వేలాది మంది నుండి డబ్బులు వసూలు చేసి వారికి ఇవ్వాల్సిన సరుకులు ఇవ్వక పోవడంతో బాధితులు గుర్ల పోసులను ఆశ్రయించిన సంగతి తెలిసిందే. గత రెండు రోజుల నుండి బాధితులు పోలీసు స్టేషన్ చుట్టూ తిరుగుతున్నారు. భాదితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పతివాడ శ్రీ లేఖ, మజ్జి అప్పల రాజుల పై బుధవారం కేసు నమోదు చేశారు.శ్రీలేఖను అదుపులోకి తీసుకోగా అప్పలరాజు గురించి గాలిస్తున్నారు.

బాధితులకు న్యాయం చేయాలి : సిఐటియు

నెల్లిమర్ల : పప్పుల చీటీ బాధితులకు న్యాయం చేయాలని సిఐటియు నాయకులు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మండల కేంద్రంలో విలేకర్లతో మాట్లాడారు. పప్పుల చీటీ స్కామ్‌లో కోట్లాది రూపాయలు మోసానికి గురైన బాధితులకు ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. స్కామ్‌కు పాల్పడి పరారైన ప్రధాన నిందితులు మజ్జి అప్పల రాజు, పతివాడ శ్రీలేఖను అరెస్టు చేసి వారి నుంచి వసూలు చేసిన నగదును రాబట్టి బాధితులకు వెంటనే చెల్లించాలన్నారు. సంక్రాంతి పండుగకు నిత్యావసర వస్తువుల ఒక్కసారిగా కొనుక్కొనే అవసరం లేకుండా చీటీల ద్వారా ప్రతి నెలా రూ.300 చెల్లించి సరుకులు వస్తాయన్న సమయంలో చేతులెత్తేసి డబ్బుతో పరారవ్వడం దారుణమన్నారు.